క్లుప్తంగా

ప్రకృతి వ్యవసాయంతో రైతులకు మేలు


ఆహార ఉత్పత్తులను విక్రయిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

కొండపి: ప్రకృతి వ్యవసాయంతో సాగుచేసిన పంటలకు మంచి డిమాండ్ ఉండి అధిక లాభాలు పొందవచ్చని యూనిట్ ఇన్‌చార్జిలు రంజిత్, మందాకిని, మాధవ అన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన ఇలవర, కట్ట వారిపాలెం, పెరిదేపి, యూనిట్లలో ఏటీఎం మోడల్ ద్వారా పండించిన పంటలను విక్రయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన పంటలకు ప్రస్తుతం మార్కెట్లో ఎక్కువ డిమాండ్ ఉందన్నారు.ప్రకృతి వ్యవసాయంపై రైతులు అవగాహన కలిగి పంటల సాగు చేయడానికి ముందుకు రావాలన్నారు. అగ్రికల్చర్ ఎగ్జిక్యూటివ్ అధికారి కుమార్, ఐసీఆర్పీలు జోత్స్న, గౌతమి, విజయలక్ష్మి, ఏడుకొండలు, తిరుమల, మాల కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

నారాయణస్వామి ఆదాయం రూ.2.15 లక్షలు

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని మిట్ట పాలెం నారాయణస్వామి ఆలయానికి ఆదివారం రూ.2,15,321 ఆదాయం వచ్చినట్లు ఆలయ వ్యవస్థాపక చైర్మన్ కొమ్మినేని చిన్న ఆదినారాయణ, ఈఓ ఎస్‌జీఆర్. నరసింహ బాబు సోమవారం తెలిపారు. స్వామి దర్శనం టిక్కెట్ల అమ్మకం ద్వారా రూ.96,010, లడ్డు ప్రసాదాల అమ్మకం ద్వారా రూ.37,680, ఆలయం వద్ద నిర్వహిస్తున్న శాశ్వత అన్న దానం పథకం నిర్వహణకు విరాళాలుగా రూ.59,567, పంచామృతాభిషేకానికి విరాళంగా రూ.22,064 విరాళంగా వచ్చినట్లు చైర్మన్, ఈఓ తెలిపారు.

పీహెచ్‌సీ వైద్యునిగా నాగేశ్వరరావు

టంగుటూరు: స్థానిక పీహెచ్‌సీ వైద్యులుగా నాగేశ్వరరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అమ్మనబ్రోలు ప్రాథమిక వైద్యశాలలో విధులు నిర్వహిస్తూ టంగుటూరుకు బదిలీపై వచ్చారు, టంగుటూరు వైద్యశాలలో విధులు నిర్వహిస్తున్న డాక్టర్ ప్రసాద్‌బాబు బదిలీపై అమ్మనబ్రోలు మండలానికి బదిలీపై వెళ్లారు.

శ్యామ్ ప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళి


శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి నివాళులు

పామూరు: బీజేపీ నాయకుడు, మాజీ పార్లమెంటేరియన్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని సోమవారం స్థానిక పార్టీ కార్యాలయం వద్ద నియోజకవర్గ ఇన్‌చార్జి కొండిశెట్టి రమణయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈసందర్భంగా శ్యాంప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి నివాళులర్పించారు.

సమయపాలన పాటించాలి


మాట్లాడుతున్న సీడీపీఓ కృపావరం

హనుమంతునిపాడు: అంగన్‌వాడీ కార్యకర్తలు సమయపాలన పాటించకుంటే శాఖాపరచర్యలు తప్పవని సూపర్‌వైజర్ కృపావరం అన్నారు. స్థానిక అంగన్‌వాడీ సెంటర్‌లో సోమవారం సెక్టార్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం సక్రమంగా అందించాలన్నారు. అనంతరం రికార్డులు పరిశీలించారు. సూపర్‌వైజర్ షేక్ గౌషనీసాబేగం, రాధ, సరస్వతి, లలితమ్మ, శోభ పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం అదుపు తప్పి ఇద్దరికి తీవ్ర గాయాలు

టంగుటూరు: ద్విచక్రవాహనం అదుపుతప్పి ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన కొండపి ఫ్లైఓవర్ సమీపంలో సింగరాయకొండ వైపు ఆదివారం అర్ధరాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు టంగుటూరు బిచ్చి రాజుపాలెంకు చెందిన పేరాబత్తిన మాధవ, స్నేహితుడు కొండపి ఫ్లైఓవర్ సమీపంలో ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడగా తీవ్ర రక్త గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం జాతీయ రహదారి అంబులెన్సులో ఒంగోలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.


క్షతగాత్రులను అంబులెన్సులో తరలిస్తున్న దృశ్యం

అధ్వాన రోడ్లు.. ఎన్నాళ్లీ అవస్థలు..


ముత్తరాసుపాలెం ఆంజనేయస్వామి గుడి సమీపంలో రూపమే కోల్పోయిన ఓవీ రోడ్డు


కందుకూరు, పొన్నలూరు మధ్యలో అధ్వానంగా ఉన్న ఓవీ రోడ్డు

- ఓవీ రోడ్డులో రోడ్డు పొడవునా పెద్ద పెద్ద గుంతలు
- అడపాదడపా వర్షంతో మరింతగా దెబ్బతిన్న రోడ్డు
- తరచూ ప్రమాదాలతో వాహనదారుల ఇక్కట్లు
- ఏడాదైన పట్టించుకోని కూటమి ప్రభుత్వం

పొన్నలూరు: రాష్ట్రంలోని రహదారుల అభివృద్ధే తమ ధ్యేయమని.. 2025 సంక్రాంతి నాటికి రాష్ట్రంలో గుంతలు లేని రోడ్లను నిర్మిస్తామని సీఎం చంద్రబాబు అనేక సభలు, సమావేశాల్లో ఊకదంపుడు ఉపన్యాసాలిచ్చారు. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదైనా నేటికి ఆ దిశగా ఎటువంటి చర్యలు తీసుకోలేదు. కొత్త రోడ్లు నిర్మాణం దేవుడెరుగు కనీసం ఉన్న రోడ్లుకు మరమ్మతులు చేపట్టిన పాపాన పోలేదు. కందుకూరు నుంచి పొన్నలూరు మీదగా కనిగిరి వెళ్లే ఓవీ రహదారి పరిస్థితి ప్రసుత్తం అధ్వానంగా ఉంది. ఈ రహదారిపై ప్రయాణమంటే వాహనదారులు బెంబేలెత్తుతున్నారు. సుమారుగా 11 ఏళ్ల క్రితం కందుకూరు నుంచి పొన్నలూరు మండల పరిధిలోని ముత్తరాసుపాలెం వరకు సింగిల్ రోడ్డును డబుల్ రోడ్డుగా విస్తరించారు. అయితే ఈ రోడ్డును తూతూమంత్రంగా నాణ్యత లేకుండా నిర్మించడంతో కొన్నేళ్లకే అడుగడుగునా గుంతలు ఏర్పడి ప్రమాదాలకు నిలయంగా మారింది. ముఖ్యంగా రోడ్డు మధ్యలో తారు, కంకర లేచిపోయి పెద్ద పెద్ద గుంతలు ఏర్పడడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో పాటు వర్షం పడినప్పుడు, రాత్రిళ్లు ఎదురెదురుగా వాహనాలు వచ్చినప్పుడు వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు. వేగంగా వచ్చే భారీ వాహనాలు, ద్విచక్ర వాహనాలు ఒక్కసారిగా బ్రేకులు వేసి గుంతలో దిగడంతో అదుపు తప్పి ప్రమాదాలకు గురవుతున్నాయి.

ముత్తరాసుపాలెం దగ్గర అధ్వానం....

కందుకూరు నుంచి ముత్తరాసుపాలెం వరకు ఓవీ రోడ్డు సుమారుగా 8 కిలోమీటర్ల దూరం ఉంటుంది. దారి పొడవునా రోడ్డు మధ్యలో మూడు, నాలుగు అడుగుల వెడల్పుతో అడుగు మేర లోతుతో గుంతలు ఏర్పడాయి. అలాగే ముత్తరాసుపాలెం సమీపంలో మూడు చోట్ల రోడ్డు పూర్తిగా దెబ్బతిని భారీగా గుంతలు ఏర్పడాయి. దీంతో రోడ్డు సరిగా లేకపోవడంతో తరచూ ఈ ప్రాంతంలో ప్రమాదాలు జరుగుతూ ప్రజల ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి. ఇటీవల ఒకే రోజు ముగ్గురు ద్విచక్ర వాహనదారులు ముత్తరాసుపాలెం సమీపంలో ఓవీ రోడ్డుపై గుంతలు ఉన్న సంగతి తెలియక వేగంగా వచ్చి ప్రమాదానికి గురయ్యారు. వారం రోజుల క్రితం మండలంలోని తిమ్మపాలెం గ్రామానికి చెందిన వ్యక్తి తన ద్విచక్ర వాహనపై వస్తూ ఓవీ రోడ్డుపై ఉన్న గుంతలో పడి కాలు విరగడంతో పాటు తీవ్ర గాయాలపాలయ్యాడు. దీంతో పాటు ఎదురుగా వాహనం రావడంతో సైడ్ దిగిన కూలీల ఆటో రోడ్డు మార్జిన్ సరిగా లేకపోవడంతో అదుపుతప్పి పడిపోయింది. ఇలా తరుచూ ఈ ప్రాంతంలో ప్రమాదాలు జరుగుతున్నాయి.

ఇంత అధ్వానమా..

ఇటీవల ఈ రహదారిపై ప్రయాణం చేసిన మంత్రి స్వామి ఇంత దారుణంగా ఉందేందని అన్నట్టు సమాచారం. అధ్వాన రహదారిపై రాకపోకలు చేస్తున్నారు గాని, దీనిపై దృష్టిపెట్టి మరమ్మతులు చేయించిన పాపాన పోలేదు. ఇటీవల కురుస్తున్న అడపాదడపా వర్షాలకు ఓవీ రోడ్డు మరింతగా దెబ్బతిని రూపం కోల్పోయింది. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టాలని ప్రయాణికులు, వాహనదారులు కోరుతున్నారు.

ఏడాదైనా పట్టించుకోని కూటమి ప్రభుత్వం...

ఓవీ రహదారి కందుకూరు, కొండపి, కనిగిరి నియోజకవర్గాల పరిధిలో ఉండటంతో ప్రతి రోజు ద్విచక్ర వాహనాలతో పాటు లారీలు, టిప్పర్లు వంటి భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అయితే గత ఏడాదిగా ఓవీ రోడ్డుపై పెద్ద గుంతలు ఏర్పడి, సైడ్ మార్జిన్లు అధ్వానంగా ఉన్నా అధికారులు, ప్రజాప్రతినిధులు చూస్తూ ఈ రహదారిపై వెళుతున్నారే తప్ప ఎవ్వరూ పట్టించుకోవడం లేదు.


ఓవీ రోడ్డుపై ఏర్పడిన పెద్ద పెద్ద గుంతలు


కొల్లగుంట అడ్డ రోడ్డు సమీపంలో బైక్ గుంతలో పడి ప్రమాదానికి గురై విరిగిన కాలు

యువతను మోసం చేసిన కూటమి సర్కార్


యువత పోరు ర్యాలీని ప్రారంభిస్తున్న దద్దాల నారాయణ యాదవ్


కొండపి నుంచి తరలివెళుతున్న యువత

- కనిగిరి నుంచి దద్దాల ఆధ్వర్యంలో ఒంగోలుకు తరలిన యువత

కనిగిరిరూరల్: కూటమి ప్రభుత్వం నిరుద్యోగులను అన్ని విధాలుగా దగా చేసిందని వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ అన్నారు. వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు చేపట్టిన 'యువత పోరు' కార్యక్రమానికి కనిగిరి నుంచి దద్దాల నారాయణ యాదవ్ ఆధ్వర్యంలో యువత వాహనాల్లో భారీగా వెళ్లారు. ఈమేరకు సోమవారం దద్దాల నారాయణ జెండా ఊపి వాహనాల ర్యాలీని ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి, పార్టీ యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు వాకుమళ్ల రాజశేఖరరెడ్డి, పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులు ఆవుల భాస్కర్‌రెడ్డి, గాంధ్లపర్తి ఆది నారాయణరెడ్డి, డాక్టర్ నాయబ్ రసూల్, కల్లూరి రామిరెడ్డి, గట్ల విజయభాస్కర్‌రెడ్డి, చెన్నుపాటి వెంకట్రావ్ చౌదరి, మేకల మాలాద్రి, కుమ్మరికుంట రవి, ఉండేల వెంగళ రెడ్డి, సారెడ్డి నాగార్జునరెడ్డి, టి.సురేష్ బాబు, పోలక సిద్ధారెడ్డి, ఎస్‌కే రహీం బాషా, సంగటి మహేంద్రారెడ్డి, ఎస్‌కే నాయబ్ రసూల్, పరిమి వెంకట్రావ్ చౌదరి తదితరులు పాల్గొన్నారు. వెలిగండ్ల మండలం నుంచి పార్టీ యువజన విభాగం నాయకులు వాహనాల్లో వెళ్లారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు తాతపుడి సురేష్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు గోనా జేమ్స్, తాతపుడి నాని, ఎలికా రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

కొండపి: వైఎస్సార్ సీపీ యువజన విభాగం ఆధ్వర్యంలో ఒంగోలులో తలపెట్టిన యువత పోరు కార్యక్రమానికి మండలం నుంచి భారీగా తరలివెళ్లారు. వైఎస్సార్ సీపీ ఎగ్జిక్యూటివ్ మెంబర్ మాలకొండయ్య, పార్టీ మండల కన్వీనర్ బచ్చల కోటేశ్వరరావు, స్టేట్ యూత్ వింగ్ జోనల్ అధ్యక్షుడు మారెడ్డి వెంకటాద్రిరెడ్డి, రవీంద్రారెడ్డి, యామవరపు వసంతరావు, విజయరామరాజు, భీమనాథం వెంకటరెడ్డి తదితరుల ఆధ్వర్యంలో తరలివెళ్లారు.

పీసీపల్లి: ఒంగోలులో జరిగిన యువత పోరు కార్యక్రమానికి పార్టీ మండల కన్వీనర్ గోపవరపు బొర్రారెడ్డి, జెడ్పీటీసీ లక్ష్మీ కాంతం ఓకేరెడ్డి, పోలు జయరాంరెడ్డి, ఎంపీటీసీ కొండారెడ్డి, నరసింహారెడ్డి ఆధ్వర్యంలో తరలివెళ్లారు.

ఆలయాల హుండీ లెక్కింపు

పామూరు: స్థానిక మదన వేణుపాలస్వామి, వల్లీ భుజంగేశ్వరస్వామి ఆలయాల హుండీ లెక్కింపు కార్యక్రమం భైరవకోన ఆలయ ఈఓ డి.వంశీకృష్ణారెడ్డి పర్యవేక్షణలో ఆలయ కార్యనిర్వాహణాదికారి శ్రీగిరిరాజు నరసింహబాబు సమక్షంలో సోమవారం ఆలయాల్లో నిర్వహించారు. మొత్తం 14 నెలల 19 రోజులకు గాను శ్రీమదన వేణుగోపాలస్వామివారి ఆలయానికి రూ.1,06,778, భుజంగేశ్వరస్వామి దేవస్థానానికి రూ.2,08,523 హుండీ ఆదాయంగా వచ్చినట్లు ఈఓలు తెలిపారు. అర్చకులు నారాయణం సత్యబాబుస్వామి, మహంకాళి శివప్రసాద్, ఆలయ సిబ్బంది, కొండిశెట్టి రమణయ్య, బండ్లా నారాయణ, ఓగూరి ఏడుకొండలు పాల్గొన్నారు.


హుండీ లెక్కిస్తున్న సిబ్బంది

వేలం ద్వారా రూ.2,64,000 ఆదాయం

టంగుటూరు: మండలంలోని వల్లూరమ్మ దేవస్థాంలో పాత సామను బహిరంగ వేలం ద్వారా రూ.2,64,000 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్య నిర్వహణాధికారి బి.రమేష్‌బాబు తెలిపారు. ఆలయానికి సంబంధించి నిరుపయోగంగా ఉన్న పాత ఇనుము, పాత జనరేటర్, ఇత్తడి గంటలు బహిరంగ వేలం నిర్వహించగా రూ.2,64,000 ఆదాయం వచ్చినట్లు ఈఓ తెలిపారు. కార్యక్రమంలో పరిశీలకులుగా దేవాదాయ శాఖ అధికారి సీహెచ్ వేణుగోపాల్ పాల్గొన్నారు.

విరాళాల నగదు చోరీ

పామూరు: ఆలయంవద్ద అన్నదానం నిర్వహించేందుకు సేకరిస్తున్న విరాళాల నగదు చోరీకి గురయ్యాయి. ఈ ఘటన మండలంలోని కమ్మవారిపాలెం అచ్చమాంబ ఆలయ పరిసర ప్రాంతంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. మండలంలోని కమ్మవారిపాలెంలో గత 5 రోజులుగా అచ్చమాంబ పేరటాళ్ల బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా ఆదివారం నాడు ఆలయ పరిసర ప్రాంతంలో ఆలయ కమిటీ సభ్యులు అన్నదానంకోసం విరాళాలు సేకరిస్తున్నారు. ఈసందర్భంలో విరాళాలు నగదు రూ.2.40 లక్షల ఉన్న బ్యాగ్‌ను గుర్తుతెలియనివ్యక్తి తస్కరించుకుపోయాడు. ఆలయ కమిటీ అడుసుమల్లి నరసింహం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై టి.కిషోర్‌బాబు తెలిపారు.

బలవంతపు భూ సేకరణ ఆపాలి

ఉలవపాడు: కరేడు పరిధిలో బలవంతపు భూ సేకరణ నిలుపుదల చేయాలని సీఐటీయూ, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలు డిమాండ్ చేశాయి. ప్రభుత్వం భూ సేకరణ నోటిఫికేషన్ ఇవ్వడంతో ఆయా సంఘాల నాయకులు కరేడు ప్రాంతంలో పర్యటించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధానకార్యదర్శి అజయ్‌కుమార్, వ్యవసాయకార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పుల్లయ్య, రైతు సంఘం జిల్లా కార్యదర్శి వెంగయ్య మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వాసితులతో మాట్లాడకుండా, గ్రామసభలు నిర్వహించకుండా నోటిఫికేషన్ ఇవ్వడం దారుణమన్నారు. మూడు పంటలు పండే భూములు, పండ్ల తోటలతోపాటు, గిరిజనులు, ఎస్సీలు నివాసం ఉండే ఉప్పరపాలెం, రామకృష్ణాపురం ఇళ్ల స్థలాలు కూడా తీసుకోవాలని నిర్ణయం తీసుకోవడం మంచిది కాదన్నారు. నిర్వాసితులకు అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. నిర్వాసితులు, ఐక్యంగా, ధైర్యంగా ఉండాలన్నారు. సీఐటీయూ ఆధ్వర్యంలో పోరాటం చేస్తామన్నారు. ఉప్పరపాలెం అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు, కుమార్, గౌస్, గంజి కోటేశ్వరరావు, రామలక్ష్మమ్మ, కత్తి మహేష్, దువ్వూరిజాన్, లలితమ్మ కత్తి అనీల్, వీసం విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ కార్యాలయం తనిఖీ


రికార్డులు తనిఖీ చేస్తున్న ఎక్సైజ్ ఈఎస్ ఆయేషాబేగం

సింగరాయకొండ: మండల కేంద్రంలోని ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయాన్ని ఒంగోలు ఎక్సైజ్ సూపరింటెండెంట్ షేక్ ఆయేషాబేగం సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయ రికార్డులు తనిఖీ చేశారు. పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. సర్కిల్ పరిధిలోని అన్ని మండలాల్లో గంజాయి అమ్మకాలు జరగకుండా, మద్యం బెల్టు షాపులు నిర్వహించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఒంగోలు అసిస్టెంట్ ఈఎస్ వెంకట్, సీఐ ఎం శివకుమారి, ఎస్సై రాజశేఖర్ పాల్గొన్నారు.

కనులపండువగా కల్యాణోత్సవం

పామూరు: మండలంలోని కమ్మవారిపాలెం కోదండ రామస్వామి తిరునాళ్ల సందర్భంగా సోమవారం శాంతి కల్యాణం రుత్వికుల వేదమంత్రాల నడుమ కనుల పండువగా నిర్వహించారు. అర్చకులు కొల్లూరి రవికిరణ్‌శర్మ గర్భాలయంలోని సీతా, రామ, లక్ష్మణ, హనుమంత మూల విగ్రహమూర్తులకు పంచామృతాభిషేకం, విశిష్ట పూజలు చేశారు. అనంతరం స్వామి ఉత్సవమూర్తులను వేడుకగా ఆలయం నుంచి కల్యాణ వేదికపైకి తెచ్చి సీతారాముల శాంతి కల్యాణం జరిపించారు. కల్యాణానంతరం హనుమంత వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు.


కోదండరామస్వామి కల్యాణోత్సవంలో తాళి చూపుతున్న అర్చకులు

పరిసరాల పరిశుభ్రత ముఖ్యం

సీఎస్‌పురం(పామూరు): మలేరియా వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సీఎస్‌పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం షేక్.ఖాదరున్నీసాబేగం, మలేరియా ఎస్‌యూఓ రామాంజనేయులు అన్నారు. స్థానిక జెడ్పీహెచ్‌ఎస్‌లో సోమవారం మలేరియా వ్యాధిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నీటి నిల్వలతో దోమలు పెరుగుతాయని, వాటిని పరిశీలించి ఎప్పటికప్పుడు నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని సూచించారు. పీహెచ్‌సీ సీహెచ్‌ఓ మురళి, హెల్త్ సూపర్‌వైజర్ ఉమామహేశ్వరరావు, బాల కొండయ్య, ఆరోగ్య కార్యకర్తలు, ఆశాలు పాల్గొన్నారు.


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న హెచ్‌ఎం, వైద్యసిబ్బంది

భూ సమస్యలు పరిష్కరించాలని ధర్నా

కనిగిరిరూరల్: పేదల భూ సమస్యలపై ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఆర్డీఓ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బడుగు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ హనుమంతునిపాడులోని హాజీపురం, మిట్టపాలెం ఉమ్మడి రెవెన్యూ పరిధిలో స్థానికేతరుల పేరుతో ఉన్న 54 మందికి చెందిన 214 ఎకరాల్లోని బినామీ పట్టాలను రద్దు చేసి పేదలకు పంచుతామన్న హామీని అమలు చేయాలన్నారు. పేదలకు ప్రభుత్వ భూమిని పంపిణీ చేస్తామన్న ప్రభుత్వ హామీ నేటికి ఒక్క అడుగు ముందుకు వేయలేదన్నారు. పీసీపల్లి మండలం కోదండరామాపురం, మెట్టవారిపల్లి 22 మంది దళితులకు ఎస్సీ కార్పొరేషన్ ద్వార భూములు కొనుగోలు చేసి పంపిణీ చేసిన భూమిని అక్రమ రిజిస్ట్రేషన్ చేశారన్నారు. దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా ఆర్డీఓ విచారణ చేయిస్తామని చెప్పి పట్టించుకోలేదని ఆరోపించారు. రెవెన్యూలో అవినీతి పెరిగిందని, దీని వల్ల పేదలకు అన్యాయం జరుగుతుందన్నారు. వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు సారకాయల ఏసేపు, మల్లెల ఇజ్రాయిల్, జి.బాలయ్య, గురుస్వామి, పోతురాజు పాల్గొన్నారు.


ధర్నా చేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

వాలిపోయిన విద్యుత్ స్తంభాలు


నర్శింగోలు విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో వాలిన విద్యుత్ స్తంభాలు

- ఆందోళనలో రైతులు

జరుగుమల్లి (సింగరాయకొండ): మండలంలోని నర్శింగోలు విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో రోడ్డు పక్కన పొలాల్లో వేసిన ప్రధాన విద్యుత్ లైను ఉన్న స్తంభాలు ప్రమాదకరంగా ఒరిగిపోయి ఉన్నాయని ఆ ప్రాంత రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో ఇటీవల కాలంలో ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురుస్తున్నాయని, వీటి కారణంగా విద్యుత్ స్తంభాలు క్రమేపీ వాలిపోతున్నాయని రైతులు తెలిపారు. ఈదురుగాలులతో వర్షాలు కురిస్తే ఈ స్తంభాలు వాలిపోయి నేలకు తాకే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా ఉన్నా ఆ శాఖ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని రైతులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి విద్యుత్ స్తంభాలకు మరమ్మతులు చేయాలని రైతులు కోరుతున్నారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు


వార్డుల్లో పర్యటిస్తున్న చైర్మన్ గఫార్

కనిగిరిరూరల్: పట్టణంలోని నీటి ఎద్దడి నివారణకు తక్షణ చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. స్థానిక 8వ వార్డుల్లో సోమవారం చైర్మన్ గఫార్ పర్యటించి, ట్యాంకర్లతో నీటి సరఫరా జరుగుతున్న తీరును పరిశీలించారు. అనంతరం చైర్మన్ గఫార్ మాట్లాడుతూ పట్టణంలో ఎక్కడ నీటి సమస్య వచ్చినా తక్షణం స్పందించాలని మున్సిపల్, సచివాలయ అధికారులను, సిబ్బందిని ఆదేశించారు.

మీకోసంకు 4 అర్జీలు

సింగరాయకొండ: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం జరిగిన మీకోసం కార్యక్రమంలో 4 అర్జీలు వచ్చినట్లు డిప్యూటీ తహశీల్దార్ తానికొండ ప్రసాద్ తెలిపారు. వీటిలో మూడు అర్జీలు భూముల సర్వే కోసం రాగా, ఒక అర్జీ బీసీ కార్పొరేషన్ రుణం కోసం వచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఫైనాన్స్ కంపెనీపై చర్యలు తీసుకోవాలి

సింగరాయకొండ: వాయిదా డబ్బులు సక్రమంగా చెల్లించలేదని దౌర్జన్యానికి పాల్పడ్డ ఫైనాన్స్ కంపెనీ ప్రతినిధులను శిక్షించాలని సీపీఐ నియోజకవర్గ సహ కార్యదర్శి టంగుటూరి ప్రభాకర్ డిమాండ్ చేశారు. మండలంలోని బింగినపల్లి ఎస్టీ కాలనీకి చెందిన గిరిజనుడు పోట్లూరి వెంకటేశ్వర్లు కుటుంబాన్ని సోమవారం పరామర్శించారు. గద్దల బాలకోటయ్య, సైకం బలరాం, మానికల రమణమ్మ, తదితరులు పాల్గొన్నారు.